క్లుప్తంగా

బాణసంచా లైసెన్సుకు దరఖాస్తు చేసుకోవాలి

తాళ్లపూడి(కొవ్వూరు): వచ్చే నెల 20న దీపావళి సందర్భంగా బాణసంచా దుకాణాలు ఏర్పాటు చేసుకునే వారు తాత్కాలిక బాణసంచా లైసెన్సుల కొసం దరఖాస్తులు చేసుకోవాలని కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత సూచించారు. ఈ మేరకు ఆమె ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. బాణసంచా వ్యాపారులు వచ్చే నెల 3వ తేదీ నుంచి 16వ తేదీ లోపు కొవ్వూరు రెవెన్యూ డివిజనల్ వారి కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తుతో పాటు ఆధార్ కార్డు, పాన్‌కార్డు, చలానా ఒరిజినల్, జీఎస్టీ చెల్లించి తప్పనిసరిగా ఏసీటీవో కార్యాలయం నుంచి స్టాంప్ వేసి అందజేయాలన్నారు. సదరు లైసెన్స్ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులకు అనుగుణంగా ఉండాలని ఆర్డీవో తెలిపారు.

పీహెచ్‌సీ వైద్యుల సమ్మెబాట

నల్లజర్ల: పీజీ మెడికల్ కోర్సుల్లో ప్రభుత్వ వైద్యులకు ఇన్ సర్వీసు కోటా కుదింపును వ్యతిరేకిస్తూ, వివిధ సమస్యలు పరిష్కరించాలనే డిమాండ్‌తో పీహెచ్‌సీ వైద్యులు సోమవారం నుంచి విధులు బహిష్కరించి సమ్మె చేయనున్నట్టు నల్లజర్ల, పోతవరం పీహెచ్‌సీ డాక్టర్లు గంగాధరావు, సిరాజుద్దీన్‌లు తెలిపారు. రాష్ట్ర వైద్యుల సంఘం పిలుపు మేరకు తాము విధులు బహిష్కరిస్తున్నట్టు వెల్లడించారు. ఈ మేరకు తమ డిమాండ్లు వివరిస్తూ వినతి పత్రాన్ని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజుకు ఆదివారం అందజేశారు. ప్రజల సేవలో ఉన్న వైద్యుల భవిష్యత్తు కోసం ఈ పోరాటం చేయాల్సి వస్తుందని పలువురు వైద్యులు పేర్కొన్నారు. ఈ నెల 26 నుంచి ప్రారంభమైన తమ ఆందోళనలు దశల వారీగా నిరసిస్తూ సోమవారం విధులు బహిష్కరిస్తున్నట్టు వివరించారు. 30న, వచ్చే నెల 1న జిల్లా కేంద్రాల్లో నిరసన ర్యాలీలు నిర్వహిస్తునున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

దొంగలొచ్చారు.. జాగ్రత్త

దేవరపల్లి: మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఉత్తర ప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన దోపిడీ దొంగలు జిల్లాలోని పలు ప్రాంతాల్లో దొంగతనాలకు పాల్పడుతున్నారని దేవరపల్లి సీఐ బీఎస్ నాయక్ ఆదివారం పేర్కొన్నారు. రాత్రిళ్ల ఇళ్లల్లో ఒంటరిగా ఉంటున్న మహిళలే టార్గెట్‌గా వాళ్లను కొట్టి విలువైన వస్తువులను దోపిడి చేస్తున్నట్టు ఆయన తెలిపారు. దొంగలంతా హిందీలో మాట్లాతున్నారని గ్రామాల్లో అపరచిత వ్యక్తులు సంచరిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఆయన సూచించారు. మొబైల్ నంబర్లు 94407 96584 (సీఐ), 944079 66659 (గోపాలపురం ఎస్సై)కు సమాచారం ఇవ్వాలన్నారు. దొంగలను పట్టిస్తే రూ.50 వేలు నజరానా అందిస్తామని ఆయన ప్రకటించారు. రాత్రిళ్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు.

వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో నిరసన



సాలి వేణు

దేవరపల్లి: విద్య, వైద్య రంగాల పట్ల ప్రభుత్వం అవలంభిస్తోన్న నిరంకుశ విధానాలను నిరశిస్తూ ఈ నెల 30న రాజమహేంద్రవరంలోని మంగళవారం గోకవరం బస్టాండ్ వద్ద డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద వైఎస్సార్ సీపీ జిల్లా ఎస్సీ విభాగం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు జిల్లా అధ్యక్షుడు సాలి వేణు ఆదివారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు నిరసన కార్యక్రమం ప్రారంభమవుతుందని, ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేసి పేద, బడుగు బలహీన వర్గాల ప్రజలకు వైద్యం అందుబాటులో లేకుండా కూటమి ప్రభుత్వం చేస్తున్న కుతంత్రాలను ఎస్సీ విభాగం తీవ్రంగా వ్యతిరేకిస్తుందని మండిపడ్డారు. నిరసన కార్యక్రమానికి గ్రామ, మండల, జిల్లా కమిటీల నాయకులు, పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

పేకాడుతున్న ఆరుగురి అరెస్టు

తాళ్లపూడి: అన్నదేవరపేటలో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై దాడి చేసి ఆరుగురు జూదరులను అదుపులోకి తీసుకున్నట్టు తాళ్లపూడి ఎస్సై టి.రామకృష్ణ ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ముందస్తు సమాచారం మేరకు పేకాట శిబిరంపై దాడి చేసి నిందితుల వద్ద నుంచి రూ.3,850 నగదు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

సూర్యదేవుడికి ప్రత్యేక పూజలు



ప్రత్యేకాలంకరణలో సూర్యదేవుడు, దేవేరులు

పెదపూడి: జి.మామిడాడలో ప్రసిద్ధి చెందిన ఉషా, ఛాయ, పద్మిని, సాంజ్ఞ సమేత సూర్యదేవుని సన్నిధిలో ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధానార్చకుడు రేజేటి వెంకటనరసింహాచార్యులు ఆధ్వర్యంలో స్వామివారికి పంచామృతాభిషేకాలు, వ్రత పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాల వితరణ, అన్న సమారాధన జరిగాయి.

దొంగలను పట్టుకోండి బాబాయ్‌లు..!

- నెల రోజులుగా జోరుగా దొంగతనాలు
- పట్టించుకోని పోలీసులు
- గుడిలో చోరీ జరిగినా కేసు నమోదు చేయని వైనం



పెరవలి పోలీస్ స్టేషన్

పెరవలి: దొంగతనాలకు అడ్డాగా, అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా పెరవలి మారడంతో ప్రజలు హడలిపోతున్నారు. ఏ క్షణాన ఏం జరుగుతుందో తెలియట్లేదని స్థానికులు భయపడుతున్నారు. గతేడాది ఇదే సమయంలో దొంగతనాలు జోరుగా సాగాయి. పగలు సెల్‌ఫోన్‌లు మాయం చేయటం, రాత్రిళ్ల దారి దోపిడీలు, దొంగతనాలు జరగటంతో ప్రజలు బిక్కుబిక్కుమంటూ కాలం వెల్లదీశారు. నిత్యం ఎంతో రద్దీగా ఉండే పెరవలి సెంటర్‌లో ప్రతిరోజూ సెల్‌ఫోన్‌లు పోతున్నా పోలీసులు నిఘా ఏర్పాటు చేయలేదంటే వారు ఎంత అప్రమత్తంగా ఉంటున్నారో తెలుస్తుంది. నిత్యం ప్రయాణికుల సెల్‌ఫోన్‌లు దొంగిలిస్తుంటే పోలీసులు మాత్రం ప్రేక్షక పాత్ర వహించటం దారుణం అని ప్రజలు విమర్శిస్తున్నారు. చీకటి పడిందంటే పెరవలి సెంటర్‌లో గంజాయి అమ్మకాలు, దానిని సేవించటానికి వచ్చిన యువకులు పబ్లిక్‌గా వినియోగిస్తున్నా ఏమీ పట్టనట్లు పోలీసులు ఉంటున్నారు.

అసాంఘిక కార్యకలాపాలు

పెరవలి మండలంలో రోజురోజుకి అసాంఘిక కార్యకలాపాలు జోరుగా సాగుతున్నాయి. జాతీయ రహదారిపై రోడ్డు పక్కన వ్యభిచారం జోరుగా జరుగుతున్నా పట్టించుకున్న పాపాన పోలేదు. యువకులు పెడదోవ పట్టి గంజాయిని విచ్చలవిడిగా వినియోగిస్తున్నా పట్టించుకోవటం లేదు. ఎక్కడ పడితే అక్కడ పేకాటలు ఆడుతున్నా చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారు. వీటికి పోలీసులు అడ్డుకట్ట వేయట్లేదని ప్రజలు మండిపడుతున్నారు.

పోలీసుల నిఘా ఎక్కడ?

పెరవలి మండలంలో జోరుగా దొంగతనాలు జరుగుతున్నా పోలీసులు ఎటువంటి నిఘా ఏర్పాటు చేయకపోవటంతో ప్రజలు పెదవి విరుస్తున్నారు. ఈ ఏడాది 23 దొంగతనాలు జరగ్గా.. వీటిలో 12 పరిష్కరించామని పోలీసు రికార్డులు వెల్లడిస్తున్నాయి. కానీ 10 రోజుల క్రితం ఉసులుమర్రు ఆంజనేయస్వామి గుడిలో చోరీ జరిగినా నేటి వరకూ ఎటువంటి చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. ఇక్కడ దొంగతనం జరిగిన తీరు సీసీఫుటేజీలో క్లియర్‌గా కనిపిస్తున్నా పోలీసులు కేసు కూడా నమోదు చేయలేదంటే వారి పనితీరు ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. సెప్టెంబర్ 20, 21 తేదీల్లో అన్నవరప్పాడులో ఇంటి వద్ద ఉన్న బైక్‌లను రోజుకి ఒకటి చొప్పున రెండు బైక్‌లు అపహరణకు గురయ్యాయి. నిడదవోలులో ఒకే రోజు మూడు దొంగతనాలు జరిగాయి. ఉండ్రాజవరం మండలంలో రెండు దొంగతనాలు జరిగాయి. ఇవే కాకుండా ఇళ్లల్లో పలు దొంగతనాలు జరిగాయని పోలీసులకు చెప్పినా ఎటువంటి ఫలితం లేదని బాధితులు వాపోతున్నారు. ఈ దారి దోపిడీలకు అడ్డుకట్ట పడేదెప్పుడు, దొంగతనాలు ఆగేదెప్పుడని ప్రజలు చర్చించుకుంటున్నారు. పోలీసులు మాత్రం దసరా సందర్భంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, దొంగతనాలు జరుగుతున్నాయి. విలువైన వస్తువులు ఇంటిలో ఉంచవద్దని, బ్యాంక్ లాకర్లలో భద్రపరుచుకోవాలని చెబుతున్నారు కానీ, చర్యలు మాత్రం తీసుకోవడం లేదని విమర్శిస్తున్నారు. ముఖ్యంగా మండలంలో కానూరు, పెరవలి, ఖండవల్లి సెంటర్లలో ఉదయం, సాయంత్రం పోలీసును కాపలా పెడితే కొన్ని దొంగతనాలు అరికట్టవచ్చని స్థానికులు అంటున్నారు.

వృద్ధాశ్రమం పుస్తకావిష్కరణ

దేవరపల్లి: మండలంలోని బంధపురంకు చెందిన పెదవేగి సత్య ప్రకాష్ రచించిన వృద్ధాశ్రమం పుస్తకాన్ని కృష్ణంపాలెంలోని డాక్టర్ బీ.ఆర్ అంబేడ్కర్ మెమోరియల్ ట్రస్ట్ వృద్ధాశ్రమం నందు ఆదివారం జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి డి.సువర్ణరాజు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రచయిత సత్య ప్రకాష్ మాట్లాడుతూ వృద్ధాశ్రమంలో ఉన్న వృద్ధుల అనుభవాలు, బాధలను తెలియజేయాలనే ఉద్దేశ్యంతో ఈ పుస్తకాన్ని రచించినట్టు ఆయన తెలిపారు. అనంతరం ఆశ్రమంలో వృద్ధులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కాట్రగడ్డ గాంధీ, జనసేన గ్రామ కమిటీ అధ్యక్షుడు కంబాల సత్తిబాబు, ఆశ్రమం నిర్వాహకురాలు జి.శ్యామలాదేవి, తదితరులు పాల్గొన్నారు.

సిద్ధాంతి శర్మకు సత్కారం

నిడదవోలు: ప్రముఖ విద్యావేత్త, అనేక సేవా సంస్థల్లో ఉన్నత పదవులను నిర్వహిస్తూ తమ సేవల ద్వారా గుర్తింపు పొంది ఇటీవల గౌరవ డాక్టరేట్ పొందిన సిద్ధాంతి పాన్నా సుబ్రహ్మణ్య శర్మను నిడదవోలు మానవతా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సత్కరించారు. అనంతరం ఇద్దరు పేద విద్యార్థులకు రూ.10 వేల ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో మానవతా నిడదవోలు శాఖ అధ్యక్షుడు పెనుగొండ వెంకటేశ్వరరావు, రీజనల్ కన్వీనర్ తన్నీడి బోస్ మానవతా సభ్యులు ప్రసంగించారు.

నిరుద్యోగ భృతి ఇవ్వకపోవడం మోసం



కాపవరంలో జరిగిన రచ్చబండలో పాల్గొన్న తలారి వెంకట్రావు, నాయకులు

నియోజకవర్గ కో–ఆర్డినేటర్ వెంకట్రావు

తాళ్లపూడి (కొవ్వూరు): 20 లక్షల ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి ఇస్తానని చెప్పిన కూటమి నాయకులు ఇవ్వకపోవడం మోసమే అని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో–ఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. మండలంలోని కాపవరం పంచాయతీ పరిధిలోని గోవర్ధన గిరి వద్ద ఆదివారం బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఎన్నికల్లో చంద్రబాబు ఇచ్చిన హమీలు అమలు చేయని విధానంపై రచ్చబండ నిర్వహించి మోసాలను ప్రజలకు వివరించారు. వెంకట్రావు మాట్లాడుతూ, రాష్ట్రంలోని నిరుద్యోగులను మోసం చేసిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. గత ప్రభుత్వంలో ఏడాదిలోనే లక్షా యాభై వేల ఉద్యోగాలు ఇచ్చామన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ వెంపాటి సురేష్, రాష్ట్ర పంచాయతీరాజ్ విభాగం కార్యదర్శి సుంకర సత్యనారాయణ, రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి పరిమి సోమరాజు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ముస్లిం, మైనార్టీ కార్యదర్శి అమానూల్లా బేగ్, ముఖ్య నాయకులు తోట రామకృష్ణ, ముదునూరి నాగరాజు, గ్రామానికి చెందిన నాయకులు ఒరిగేటి రామారావు, దుగ్గిరాజు, ఒరిగేటి అబ్రహం, కార్యకర్తలు పాల్గొన్నారు.

మోసకారి ప్రభుత్వం చంద్రబాబుదే..

హామీలను అమలు చేయకుండా కూటమి ప్రభుత్వం ప్రజలను మోసగిస్తుందని తలారి వెంకట్రావు అన్నారు. మండలంలోని ఆరికిరేవులలో 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ' కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. మండల నాయకులతో కలసి ఆ గ్రామంలో రచ్చబండ నిర్వహించి చంద్రబాబు మోసాలపై ప్రజలకు వివరించారు. వెంకట్రావు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో సూపర్ సిక్స్ పథకాలంటూ కూటమి నాయకులు ఇంటింటికీ వెళ్లి బాండ్లు ఇచ్చారని, ప్రస్తుతం ఆ పథకాలను అమలు చేయకుండా అన్ని వర్గాలను ప్రభుత్వం మోసం చేయడం సిగ్గు చేటన్నారు. వైఎస్సార్ సీపీ ఇంటలెక్చువల్ ఫోరం రాష్ట్ర కార్యదర్శి బండి అబ్బులు, మండల కన్వీనర్ సురేష్, సర్పంచ్ శ్రీను, పంచాయతీ రాజ్ విభాగం కార్యదర్శి సత్యనారాయణ, రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి పరిమి సోమరాజు, పట్టణ కన్వీనర్ చిట్టూరి అన్నవరం, నాయకులు పాల్గొన్నారు.

ప్రజలను మోసం చేస్తున్న కూటమి



దుద్దుకూరులో బాబు మోసాలను వివరిస్తున్న మండల అధ్యక్షుడు సతీష్, పార్టీ నాయకులు

దేవరపల్లి: మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ప్రజలను నిలువునా దోచుకుంటుందని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కూచిపూడి సతీష్ ఆరోపించారు. దేవరపల్లి మండలం దుద్దుకూరులో ఆదివారం రాత్రి గ్రామ కమిటీ అధ్యక్షుడు పాపోలు రెడ్డిబాబు అధ్యక్షతన జరిగిన 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సూపర్ సిక్స్ పథకాలు అట్టర్ ఫ్లాప్ అయ్యాయని, అరకొరగా పథకాలను అమలు చేసి ప్రజలను కూటమి ప్రభుత్వం మోసం చేస్తోందని ఆయన మండిపడ్డారు. 18 నెలల కూటమి పాలనలో ప్రజలు విసుగుచెందారన్నారు. రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని, వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సీజన్ ప్రారంభానికి ముందే రైతులకు పెట్టుబడి సాయం అందించి ఆదుకున్నారని ఆయన గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ గన్నమని జనార్దనరావు, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి గడా జగదీష్, బీసీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేడిబోయిన గంగరాజు, రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి గడా రాంబాబు, యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి సత్తి సాయి ఈశ్వరరెడ్డి, మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆచంట అనసూయ పార్టీ శ్రేణులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నత్తలతో పంటలు గుల్ల

- నత్తల నిర్మూలనకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలి
- ఎమర్జెన్సీ జోన్‌గా ప్రకటించాలి



చెట్టుకు పట్టిన నత్తలు

నల్లజర్ల: పంటలపై దాడి చేసి నష్టపరుస్తున్న ఆఫ్రికా నత్తలతో రైతుల్లో ఆందోళన మొదలైయిందని వాటి నిర్మూలనకు ప్రభుత్వం తక్షణమే చర్యలు చేపట్టాలని సీఐటీయూ జిల్లా నాయకులు కొక్కిరపాటి వెంకట్రావు విజ్ఞప్తి చేశారు. పండ్లు, కూరగాయల సాగులో నత్తలు విస్తృతంగా వ్యాపించి రాత్రికి రాత్రే పంటలను ధ్వంసం చేస్తున్నాయని, కాండాన్ని, పిందెల్ని, పువ్వులను నమిలివేయడంతో చెట్లు ఎండిపోతున్నాయన్నారు. వీటి నివారణకు రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టినా ఫలితం లేకుండా పోయిందన్నారు. ఒకవైపు పండిన పంటలకు సరైన దిట్టుబాటు ధర లేక రైతులు నానా ఇబ్బందులు పడుతున్నా కనీసమద్దతు ధర ప్రకటించడం లేదని మరోవైపు ఊహించని నత్తల వంటి వల్ల రైతు కన్నీరు పెడుతున్నారన్నారు.

మూలిగే నక్కపై తాటిపండు పడినట్లు

దేశానికి వెన్నుముఖగా ఉన్న రైతు పరిస్థితి మూలిగే నక్కపై తాటిపండు పడ్డ చందంగా ఉందన్నారు. కేరళ నుంచి దిగుమతి చేసుకుంటున్న వక్క మొక్కల ద్వారా జీవులు ఈ ప్రాంతానికి వచ్చినట్టు శాస్త్రవేత్తల బృందం నిర్ధారించినప్పటికి అందుకు నిర్దిష్టమైన ఆధారాలు లేవన్నారు. మరేదైనా కుట్రకోణం దాగి ఉందా? అనే కోణంలో సమగ్ర విచారణ జరపాల్సి ఉందన్నారు. నత్తల నివారణకు శాస్త్రవేత్తలు సూచించిన నివారణ చర్యలు సత్ఫలితాలు ఇవ్వడం లేదని ఈ సమస్యపై తక్షణమే ప్రభుత్వం ఎమర్జెన్సీ జోన్‌గా ప్రకటించాలన్నారు. పరిసర ప్రాంతాలకు వ్యాప్తి చెందకుండా సమగ్రమైన వ్యూహం అమలు చేయాలన్నారు. నష్టం అంచనా వేసి తక్షణం పరిహారం రైతులకు అందించాలన్నారు. భవిష్యత్తులో ఇటువంటి విపత్తులు పునరావృతం కాకుండా పరిశోధనలు జరిపి రైతులకు సూచనలు, సలహాలు అందించాలన్నారు.

వర్గీకరణ బిల్లు ఆమోదంపై ఎమ్మార్పీఎస్ హర్షం



గోపాలపురంలో ఐక్యత చాటుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

గోపాలపురం: మూడు దశాబ్దాల కల ఎస్సీ వర్గీకరణ బిల్లును వర్షకాల అసెంబ్లీ సమావేశాల్లో ఆమోదం తెలపడం హర్షించదగ్గ విషయమని ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బొబ్బిలి వెంకటరాజు అన్నారు. ఉప్పరగూడెం బాబూ జగజ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద ఆదివారం ఏపీ ఎమ్మార్పీఎస్ నాయకులతో బిల్లు ఆమోదించడంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు రాష్ట్ర శాసన సభాపతి కొయ్య మోషేన్‌రాజు, ప్రధాన మంత్రి, ముఖ్యమంత్రులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు గెల్లా వెంకటశ్రీను, పత్తిపాటి రాంబాబు, వీనపల్లి నవీన్, పత్తిపాటి సూరజ్, తానేటి రాజేష్, తానేటి క్రాంతి ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

బార్ తొలగించాలని మహిళల ఆందోళన



బార్ వద్ద ఆందోళన చేస్తున్న మహిళలు

నిడదవోలు: పట్టణంలోని సుబ్బరాజుపేట దళితవాడలో ఏర్పాటు చేసిన చైతన్య బార్ అండ్ రెస్టారెంట్‌ను తొలగించాలని అంబేడ్కర్ యూత్, జగజ్జీవన్‌రాయ్ సేవా సమితి సభ్యులు, మహిళలు డిమాండ్ చేస్తూ ఆదివారం బార్ వద్ద ఆందోళన చేపట్టారు. ప్రజా సంఘాలు మద్దతు పలికి బార్ ముందు బైఠాయించారు. మద్యం సీసాలు దగ్ధం చేసి ఆందోళనను ఉధృతం చేశారు.

ఈ సందర్భంగా బీఎస్పీ నాయకులు బయ్యే మునీంద్ర మాట్లాడుతూ, దళిత ప్రజలను లక్ష్యం చేసి మహిళలు, కుటుంబాలు విచ్ఛిన్నం అయ్యేలా బార్లు, మద్యం దుకాణాలు ఏర్పాటు చేసి కూటమి ప్రభుత్వం దళితులపై చిత్తశుద్ధిని బహిర్గతం చేస్తుందన్నారు. మహిళా సంఘం నాయకురాలు దయామణి మాట్లాడుతూ, ఇప్పటికే మద్యం వల్ల దళిత కుటుంబాల యువకులు, మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. మహిళలపై అఘాయిత్యాలు పెరుగుపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు బైపే రాజేశ్వరరావు, రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ సీపీ మండల సమావేశం

నల్లజర్ల: వైఎస్సార్ సీపీ నల్లజర్ల మండల పార్టీ సమావేశం సోమవారం సాయంత్రం 4 గంటలకు నల్లజర్లలోని పార్టీ కార్యాలయంలో జరుగుతుందని మండల కన్వీనర్ వెల్లంకి వెంకట సుబ్రమణ్యం ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి నియోజకవర్గ కన్వీనర్ తానేటి వనిత ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. జగనన్న 2.0 లోగో ఆవిష్కరణ, బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమం, గ్రామ కమిటీ నియామకాలు తదితర అంశాలపై సమావేశంలో చర్చిస్తారన్నారు. స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ముఖ్యనేతలంతా సమావేశానికి హాజరుకావాలన్నారు.

గుర్రం జాషువా విగ్రహానికి నివాళులు



కొవ్వూరు జాషువా జయంతి కార్యక్రమంలో పాల్గొన్న వివిధ పార్టీల నాయకులు

తాళ్లపూడి (కొవ్వూరు): పట్టణంలోని ఎల్ఐసీ సెంటర్‌లోని విగ్రహం వద్ద గుర్రం జాషువా జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పట్టణంలో గల వివిధ రాజకీయ పార్టీల నాయకులు వివిధ వర్గాల ప్రజలు జాషువా విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. సొసైటీ అధ్యక్షుడు కంటమణి రామకృష్ణ మాట్లాడుతూ సామాజిక అణచివేతలపై అక్షర కొరడాను ఝళిపించిన మహోన్నతుడని, ఆయన సాహితీ సేవలను కొనియాడారు. బీజేపీ నాయకుడు పరిమి రాధాకృష్ణ మాట్లాడుతూ విద్యను సంపాదించడం ద్వారా ఏ వ్యక్తి అయినా ఉన్నత శిఖరాలు అధిరోహించగలరని, జాషువా జీవితం అందుకు నిదర్శనమని వివరించారు. కార్యక్రమ నిర్వాహకులు ముప్పిడి విజయరాం మాట్లాడుతూ, జాషువ పుట్టింది దళిత వర్గంలోనైనా పెద్ద పెద్ద ఘనాపాటిలతో కూడా సత్కారాలు పొందేంత సాహితీ సంపత్తిని సంపాదించాడని తెలియజేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర ,పలు పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా జాషువా జయంతి

నిడదవోలు: పట్టణ శాఖా గ్రంథాలయంలో కళాప్రపూర్ణ గుర్రం జాషువా జయంతిని ఘనంగా నిర్వహించారు. ముందుగా జాషువా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ, జాషువా జీవిత విశేషాలు, రచనల గురించి విశ్లేషణాత్మకంగా వివరించారు. కార్యక్రమంలో రిటైర్డు ఎంఈవో ఎల్లపు పైడియ్య, గ్రంథాలయాధికారి గద్దె శ్రీనివాసరావు, పాఠకులు పాల్గొన్నారు.

వాసవీ క్లబ్ డిస్ట్రిక్ గవర్నర్‌గా రవికుమార్

నిడదవోలు: 2026 వాసవి క్లబ్ డిస్ట్రిక్ గవర్నర్‌గా పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త కేదారిశెట్టి రవికుమార్ ఎన్నికయ్యారు. కోనసీమ జిల్లా అంతర్వేదిలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం జరిగిన వాసవీ క్లబ్ డిస్ట్రిక్ సర్వసభ్య సమావేశంలో రవికుమార్‌ను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. రవికుమార్ గతంలో నిడదవోలు రోటరీ క్లబ్ అధ్యక్షుడిగా, వాసవీ క్లబ్, వాకర్స్ క్లబ్ అధ్యక్షుడిగా, వాసవీ క్లబ్ జోన్, డిస్ట్రిక్ చైర్మన్లుగా, డిప్యూటీ గవర్నర్, వైస్ గవర్నర్‌గా, వాసవీ ఇంటన్నేషనల్ ప్రొగ్రామ్ కో–ఆర్డినేటర్‌గా పలు సమాజిక సేవలను అందించారు. పట్టణంలో పేదవర్గాలకు విద్య, వైద్య, సమాజిక సేవలను అందించి తనకంటూ ప్రత్యేక స్థానం ఆయన ఏర్పరచుకున్నారు. ఈ కార్యక్రమంలో దర్శి శ్రీనివాస్ గుప్తా, మాటూరి నరసింహమూర్తి తదితరులు రవికుమార్‌ను అభినందించారు.

సమయ పాలన పాటించని అధికారులు

పెరవలి: మండలంలో పలువురు ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు స్థానికంగా నివాసం ఉండకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. చాలా మంది అధికారులు ఎప్పుడు వస్తున్నారో, ఎక్కడికి వెళుతున్నారో తెలియని పరిస్థితి నెలకొందనే విమర్శలు వస్తున్నాయి. ఎంపీడీఓ రాజమహేంద్రవరం బొమ్మూరులో నివాసం ఉంటూ అక్కడి నుంచి ప్రతి రోజూ కార్యాలయానికి వస్తున్నారు. అలాగే, తహసీల్దార్ కొవ్వూరు నుంచి, ఎలక్ట్రికల్ ఏఈ, ఏపీఎం, ఇరిగేషన్ ఏఈ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, పీఆర్ ఏఈ, ఎస్సైలు తణుకులో నివాసం ఉంటున్నారు. ఐసీడీఎస్ సీడీపీఓ నిడదవోలు నుంచి, ఈఓ పీఆర్‌డీ మార్టేరు నుంచి వస్తున్నారు. ఇలా మండల స్థాయి అధికారులు నిత్యం రాకపోకలు సాగించటం వల్ల ప్రమాదకరమైన సంఘటనలు జరిగినప్పుడు వారు అందుబాటులో ఉండటం లేదని పలువురు వాపోతున్నారు. గ్రామ స్థాయిలో వీఆర్‌ఓలు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు వంటి సచివాలయ సిబ్బంది కూడా సమయ పాలన పాటించటం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. నిబంధనల ప్రకారం పని చేసే చోటనే నివాసం ఉండాలి. కానీ, అధికారులు దీనిని పాటించటం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

మహాచండీ హోమం



దేవరపల్లి బాలదుర్గమ్మ ఆలయంలో చండీ హోమం నిర్వహిస్తున్న పండితులు

దేవరపల్లి: దసరా మహోత్సవాల సందర్భంగా దుర్గాదేవిని మహా చండీ దేవిగా అలంకరణ చేసి భక్తులు కుంకుమ పూజలు, అభిషేకాలు నిర్వహించారు. స్థానిక బాలదుర్గమ్మ అమ్మవారికి వివిధ రకాల పండ్లరసాలు, పంచామృతాలతో భక్తులు అభిషేకం చేపట్టారు. అనంతరం వేదపండితులు మహా చండీ హోమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పరిసర ప్రాంతాల భక్తులు విశేషగంగా పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

నిడదవోలు రూరల్: దేవీ శరన్నవరాత్ర ఉత్సవాలు మండలంలో ఆయా గ్రామాల్లోని ఆలయాలు, మండపాల్లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. గోపవరం గుబ్బల మంగమ్మ, సమిశ్రగూడెంలో ఫుంతలో ముసలమ్మ ఆలయాల వద్ద భక్తులు అమ్మవార్లను దర్శించుకొని కుంకుమపూజలు చేశారు. లోహియానగర్‌లో కనకదుర్గమ్మ, కోరుమామిడిలోని అమ్మేపల్లిలో వీరాంజనేయ సహిత రాజరాజేశ్వరిస్వామి, కంసాలిపాలెం శ్రీదేవీ పాటెమ్మ ఆలయాల వద్ద ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.